

# వరద

గాలిని గాలి తెగ నరుకుతున్న హోరు....సుళ్ళు తిరుగుతూ తరుముతున్నట్లు ఏట్లో నీళ్ళ చప్పుడు. ఆ హోరులో, ఆ చప్పుళ్ళో ఎన్నో జతల కాళ్ళ, చేతుల చప్పుడు....రాళ్ళు, కర్రలు, కంపలు, ఇసుక పరిగెడుతున్న మోత....

ఆ కాళ్ళలో బలం అడుగులు వేస్తూంది. ఆ చేతుల్లో బరువులు ఆరాటపడుతున్నాయి. వాళ్ళందరూ నీళ్ళతో దెబ్బలాడుకున్నారు; పోటీపడుతున్నారు.

''తొందరగా రండిరా! బేగి అడుగు లెయ్యండిరా'' అంటున్నాడు నారాయుడు. చేతిలో పార ఉంది. ఎప్పటికప్పుడు ఒంటి మీద మట్టిని వాన కడిగేస్తూంది.

పరుగు....నడక....నడకలాంటి పరుగు. ఎవరి కందినవి వాళ్ళు తీసుకువస్తున్నారు—రాళ్ళు....ఆకులు....గడ్డి.

తెస్తూ, తేవటానికి వెడుతూ, ఏటికట్ట ఎత్తుదగ్గర మర్రిచెట్టుని, మర్రిచెట్టు మొదట్లో కూర్చున్న తనని అప్పుడప్పుడు చూస్తూ వెడుతున్నారు.

ఆ చూపులు ఇబ్బందిగానే ఉన్నాయి తనకి. వాళ్ళనుంచి వేరు చేస్తున్నాయి అవి....ఆ వేరు చేస్తున్నవాళ్ళ దృష్టిలో గౌరవమే ఉంది. తక్కువ భావన లేదు.

ముందు వద్దన్నా వినకుండా చేతికందిన ఒకటి రెండు రాళ్ళు మోశాడు. చేసే సహాయంకన్నా, వాళ్ళకి అడ్డు రావటమే ఎక్కువయింది.

"అలవాటులేని పని, బాబూ! మీ కొద్దు....మీ ఒక్క చెయ్యి సాయం లేకపోయినా పెద్ద లోటుకాదు....ఆ చెట్టు మొదట్లో కూచోండి" అన్నాడు నారాయుడు. చెయ్యి పుచ్చుకుని బలవంతంగా తీసుకువెళ్ళి కూచోబెట్టాడు.

తను కూడా వాళ్ళలాగే ఏ రాయో, రవ్వో మోసి నీళ్ళతో దెబ్బలాడాలని ఉంది. ఆసమయంలో నేనా వాళ్ళలో కలిసిపోయి వాళ్ళలో ఒకడుగా మారిపోవాలని ఆరాటంగా వుంది. కాని, అలవాటు లేదు. ఓ గంటో, రెండు గంటలో పనిచేస్తే అలవాటవుతుంది కొంత వరకూ. రోజంతా పనిచేస్తే వాళ్ళలాగే బాగా అలవాటవుతుంది. మళ్ళీ మరోసారి ఎప్పుడేనా ఇలాంటి బాధ ఉండదు....'మళ్ళీ మరోసారి ....ఎందుకు....ఏరు మళ్ళీ ఇలా పొంగాలా?....ఏటికట్టకి ఇలా గండి పడాలా....'

చెట్టు మొదట్లోకి ఎంత ఒదిగికూచున్నా కాళ్ళమీద, తల చివర నీళ్ళు పడుతూనే ఉన్నాయి....ఇబ్బందిగా ఉంది. చిరాగ్గా ఉంది.

ఏటిలో హోరు ఎక్కువైనట్టయింది. గాలి పైపైకివెళ్ళి పిలుచుకు వస్తున్నట్టు మబ్బులు ముసురుకుంటున్నాయి. మట్టితవ్వి తనలో కలుపుకున్నట్టు ఎర్రబడి పారుతున్నాయి నీళ్ళు....ఏటి కాగట్టువేపు తెల్లటి దూద కొట్టుకుపోతూంది తాటాకుల కంపలాగ....ముఖంమీద నల్లటిమచ్చ అందంగా....'అంబా' అన్న అరుపువల్ల చూశాడు అటు.

తాటాకులు....ఈతకంపలు....దూలాలు ఒకదాని తరవాత ఒకటి కొట్టుకువస్తూనే ఉన్నాయి. ఎర్రటినీళ్ళు, పచ్చటి నురగ ముందుకి తోసేస్తూనే ఉన్నాయి వాటిని.

అందరూ నిలబడ్డారు కట్టదగ్గిర....నారాయుడు నడుంమీద చేతులువేసుకుని నిలబడి చూస్తున్నాడు. రమ్మన్నట్టు చెయ్యి ఊపాడు.

గండి దగ్గిర కట్ట ఎత్తునా దాపుగా పెద్దరాళ్ళు పెట్టారు. వాటి వెనకా, ముందూ ఆకులు....కర్రలు....చిన్నచిన్న రాళ్ళు. అందరూ

చూస్తున్నారు—ఏటిని....రాళ్ళని....కట్టని....నారాయుణ్ణి....తనని....

వాళ్ళు మనుషులు నిలబడినట్టు లేరు. నీళ్ళు పిలువెత్తున నిలబడినట్టున్నారు. తలనుంచి కిందివరకూ ధారగా నీళ్ళు కారుతున్నాయి. కాళ్ళనిండా బురద....కళ్ళనిండా ఆరాటం....

"రండి, బాబూ, పోదాం" అన్నాడు నారాయుడు ఏటి గట్టెక్కుతూ.

"గండి నిలుస్తుందా? అని అడగాలనిపించింది.

రెండడుగులు వేయగానే గ్రహించినట్టు నారాయుడే మాట్లాడాడు.

"గండి చిన్నదే, బాబూ!"....దాపు బలంగానే వేశాం. కాని, నీటిపోటు ఎక్కువగా ఉంది....పైన చూస్తే ముసురుకొస్తోంది ఇంకా....రెండడుగులు నీరు పెరిగితే కట్టమీంచి పొర్లిపోద్ది...."

'పొర్లి పోద్ది' అంటున్నప్పుడు మాట కొద్దిగా తడబడింది నారాయుడికి.

గుడిదాకా వచ్చారు. వచ్చేటప్పుడు కూడా ఇదేదార్లో వచ్చారు. గుడి మలుపు తిరిగితే ఊరు....అన్నీ కలిపితే రెండు వందల ఇళ్ళు....ఇంచుమించు అన్నీ పూరిళ్ళే. ఏదో ఒకటి, రెండు పెంకుటిళ్ళు తప్ప....

గుడికూడా మరీ పెద్దదికాదు. గుడి గడప ఎత్తువరకూ నీళ్ళు నిలబడున్నాయి. ప్రహరీ లోపల, ఆవరణ అంతా కూడా నీళ్ళు నిండున్నాయి. దేవుడు మోకాళ్ళవరకు మునిగిపోయాడు. నారాయుడు మలుపు తిరుగుతూ గుడి తలుపుముందు ఓ క్షణం ఆగాడు. యాభై ఏళ్ళ కళ్ళ ఆ చూపులో, మూసుకున్న కనురెప్పల బరువులో బాధ కదిలినట్టయింది. గుడి దాటి నాలుగడుగు లేశాదిద్దమూ.

ఎలా అడగాలో అర్థం కాలేదు. ఒకటి రెండుసార్లు ప్రయత్నిస్తే మాటలు బయటికి రాకుండా నాలిక్కి చుట్టుకుపోయాయి....నారాయుడంటే భయమేం కాదు అడగలేకపోటానికి....అంత అడక్కూడనిదీ కాదు...కాని, సంకోచంగా ఉంది. పరిస్థితివల్ల....కొంచెం ఇబ్బందిగా, చిన్నతనంగా అనిపించింది.

చినుకులు పలచబడి గాలిలో ఎగురుతున్నాయి....ఇందాకటి కన్నా కొద్దిగా వెలుగ్గా ఉంది.

టైము చూసుకుంటే ఒంటి గంటన్నర అయింది.

కళ్యాణి గుర్తు వచ్చింది. పొద్దుటినించి తనేం తినలేదన్నది గుర్తువచ్చింది. వెంటనే తిరిగి వస్తానని తనని వదిలేసివచ్చి నాలుగు గంట లయింది. చివరికి అడిగేశాడు....సన్నగా బయటికి వచ్చాయి ఆ మాటలు.

"బియ్యం కావాలి. నారాయణా."

నారాయుడు వేస్తున్న అడుగు వేగం కొంచెం తగ్గింది. తన ముఖంలోకి చూశాడు....నారాయుడి చూపులు చూడా లక్షించలేదు.

వీధు లసలే అంతంమాత్రం. మోకాళ్ళ లోతు నీళ్ళున్నాయి. అన్ని ఇళ్ళలోకి చొరబడ్డాయి. ఎత్తుగా ఉన్న గోడ అంచుల చివర చేరి కప్పలు బెక బెక లాడుతున్నాయి.

"ఏం, బాబూ, ఇంట్లో...."

"అయిపోయాయి" అన్నాడు పూర్తి కాకుండానే.

ఇంకో నాలుగడుగులు వేశారు. నారాయుడి పాక దగ్గిరికి వచ్చారు. పొద్దున్న నారాయుడు సరిగ్గా అక్కడే పలుకరించాడు. ఆ ఊళ్ళో ముందుగా దణ్ణం పెట్టినవాడు, పలకరించినవాడు నారాయుడే. అతను తప్ప ఇంకెవరూ తెలియను. ఊళ్ళో మిగిలిన అందరికీ తను తెలిశాడు. కాని, తనింతవరకు ఊళ్ళో వాళ్ళెవరితోనూ మాట్లాడలేదు. ఊళ్ళోకి వచ్చి అయిదు రోజులైనా బయటికి వచ్చింది ఈ రోజే.

నరసింహం పాలేరవటంవల్ల, ముందుగా నరసింహం చెప్పి ఉండటంవల్ల తనంతగా తనే పలకరించాడు నారాయుడు పొద్దున్న.

"అందరిళ్ళలోనూ నీళ్ళు చేరాయి, బాబూ. ఇంక రంగయ్య ఒక్కడి దగ్గిరే దొరుకుతాయి. ఉత్తప్పుడే ఆడి ఆశకి అంతుండదు. ఇప్పుడు మరీ మింగుతాడు" అన్నాడు నారాయుడు.

'దొరుకుతాయి' అనగానే ధైర్యం వచ్చింది. పరిస్థితి ఎలాంటిదైనా పెళ్ళయిన కొత్త రోజుల్లోనే కళ్యాణిని పస్తు లుంచవలసి వస్తుందేమో అన్న బాధ తీసేసినట్టయింది. జేబులోంచి గబుక్కుని

పది రూపాయల కాయితం తీశాడు. తీసిం తరవాత తటపటాయింపు చూపి, నారాయుడే చొరవగా అందుకున్నాడు. "మా చిన్నాణ్ణి పంపించి తెప్పిస్తాను. రండి, బాబూ." అన్నాడు లోపలికి నడుస్తూ.

లోపలన్నీ నీళ్ళే. పాక గోడ కానుకుని నిలబడ్డాడు. నీళ్ళున్న ఎత్తుకన్నా పైవరకూ చెమ్మవల్ల తడిగా ఉన్నాయి గోడలు. ఊరికే ఇబ్బందిపడ్డాడు నారాయుడు, కూచోపెట్టలేక పోయినందుకు.

కుర్రాడు తిరిగి వచ్చేవరకూ ఆ సంగతులు, ఈ సంగతులు మాట్లాడుతూంటే, నరసింహం, రంగయ్యే ఊళ్ళో పెద్దకామందులని, ఊరు చుట్టుపక్కల పొలాలు చాలావరకు వాళ్ళవేనని చెప్పాడు నారాయుడు.

కుర్రాడిచ్చిన సంచీ అందుకున్నాడు. ఇంటివరకూ వస్తానన్న నారాయుణ్ణి అక్కర్లేదని ముందుకు నడిచాడు. సంచీ తేలిగ్గా ఉంది. రెండు సేర్లకన్నా ఎక్కువ బియ్యం ఉండవనిపించింది. నారాయుడు కూడా అదే అన్నాడు చూసి. ఆ మాత్రం దొరికిందే ఎంతో సంతోష మనిపించింది. వీధిలో నీళ్ళలోంచి నడుస్తుంటే ఏరు కళ్ళముందు కదిలింది.

అయిదారేళ్ళ క్రితం వేసవికాలంలో, నరసింహంతోపాటు వచ్చి చూశాడు ఇదే ఏటిని. పచ్చటి ఇసుకమీద పల్చటి తెరలా పారుతున్నాయి నీళ్ళప్పుడు. నీళ్ళలో సన్నటి చీలికలు, తెరలు, అవతలివేపు గట్టుమీద పచ్చగా చెట్లు. అస్తమానం కాళ్ళకి తగిలే చిన్న చిన్న చేపలు. ఆ నాడు చూసిన ఆ అందంకోసమే కళ్యాణిని ఇక్కడికి తీసుకువచ్చాడు. ఇప్పుడా ఏరు, కొట్టుకుపోతున్న దూడతో కళ్ళ ముందు కదిలింది. అడుగులు తొందరగా వేశాడు.

నరసింహం ఇల్లు, చిన్న గుట్టలాంటి దానిమీద ఊరుకన్నా బాగా ఎత్తులో ఉంది. పెద్ద ఇల్లు, విశాలంగా ముందు ఆవరణ, తోట. నరసింహం ఎక్కువగా ఈ ఊళ్ళో ఉండకపోయినా చాలా అందంగా ఉంచాడు ఇంటినీ, పరిసరాల్నీ. 'కళ్యాణి ఎలా ఉందో' అనిపించింది గుట్ట ఎక్కుతుంటే.

• • • •

కిటికీ బయట....

గాలికి ఊగుతున్న లైటు వెలుగులో తెల్లటిసూదుల్లా వర్షం. ఆ సూదులు నీళ్ళని చీలుస్తున్న గలగల మోత.

లైటు వెలుగుపడని చోట చీకటి మోగుతోంది వర్షంలా. మబ్బుల కౌగిల్లో మెరిసిన మెరుపు కాంతిలో పాముల్లా చెట్ల కుదుళ్ళల్లోకి పాకుతున్నాయి నీళ్ళు.

'పైనుంచి ధారగా పడుతున్న సూదులు పాములవుతాయి. పాములన్నీ ఒకదానితో ఒకటి కలిసి, కొండలమీంచి దార్లు, దూళ్ళని, దూలాల్ని, కంపల్ని తోసుకుంటూ ఏట్లోకి.... ఇంక రెండడుగుల నీరు పెరిగితే?' నారాయుడి కళ్ళు కళ్ళముందు కదిలాయి.

'ఎందుకీ వర్షం....ఎవరి కోసం?'

విన్న రాత్రి సరిగ్గా ఇలాగే కిటికీ బయట చీలుతున్న వెలుగులో వర్షాన్ని చూస్తుండగా.... తన పీఠమీద కళ్యాణి పల్చటి ఆకుమీద నీటిబిందువులా కిందికి జారుతుంటే.. వెన్నులోంచి పైకి పాకిన వేడి గుండెల దగ్గిర ఆగిపోతే?....

జీవితంలో కోరుకున్న- నిండు దొరికినట్టనిపించింది. గడుస్తున్న ప్రతిక్షణం, ముందు ముందు గడపబోయే సంసారజీవితానికి బలమైన పునాది వేస్తున్నట్టనిపించింది.

ఆ నగర జీవితంలోని ఇరుకుకి, నా అన్న ఫ్యాక్టరీ గోడపలకి, మనసుని చెదలా తినే డబ్బు మోజుకి దూరంగా కనీసం కొన్ని రోజులేనా కళ్యాణితో గడపాలని మారుమూల ఈ పల్లెకి వచ్చినందుకు ఆనందం నిండుగా దొరుకుతున్నట్టనిపించింది.

ఆ వర్షం, కిటికీలోంచి గాలి విసిరిన జల్లు వరంలా తోచాయి. కళ్యాణి స్పర్శ... జీవితంలోని బాధలకి, వ్యామోహాలకి, ఆగచాట్లకి, అవమానాలకి, కన్నీళ్ళకి కవచంలా స్త్రీ పురుషులకి సృష్టి ప్రసాదించిన సౌఖ్యమేమో అనిపించింది. ప్రకృతి నవ్వుతున్నట్టున్న ఆ వర్షం తన కోసమే అన్న తృప్తి.

'అలాగే ఈ రోజు కూడా తృప్తిపడేవాళ్ళు ఉండకూడదూ?

విన్న జీవిత అవసరంలేదు. అనుభవం తప్పు. రేపన్న ధ్యాసలేదు. కాని ఇప్పుడు.... రేపు....'

తనని తాకుతున్న ఆ వేళ్ళెవరివో తెలుసు....కళ్యాణి.

"ఎందుకు ఊరికే అలా....అంతగా ఇక్కడ వర్షాలు చిరాగ్గా ఉంటే మనింటికి వెళ్ళిపోదాం...." అంటూంది చెవి దగ్గిర నెమ్మదిగా, అమాయకంగా....

"అవును, వెళ్ళిపోదాం....రేపు...." కాని కాళ్ళు బయట పెడితే నీళ్ళు....నీళ్ళు....రేపు మధ్యాహ్నం వరకూ బియ్యంఉన్నాయి. బయటికి వెళ్ళక్కర్లేదు.

* * *

ఇంకా తెల్లవారని మసకచీకట్లో....

చీకటిలా ఉన్నాడు నారాయుడు. గడ్డం ఆన్చటంవల్ల చేతిలో కర్ర నేలమీద మట్టిలో కొద్దిగా కూరుకుపోయింది.

"మరయితే రాత్రంతా...." అన్నాడు తను.

"సగం రాత్రినించి చిన్నా, పెద్దా అంతా గోడలమీద, పాక కప్పులమీద గడిపాం, బాబూ...."

'చీకట్లో....కురిసే వర్షంలో ఆడా, మగా, చిన్నా పెద్దా గోడల మీద....ఇళ్ళ కప్పులమీద....' ఊహ కళ్ళముందు దృశ్యంగా ప్రయత్నించినా కనపడలేదు తనకి. చీకటిలా అయిపోయింది.

"అసలే పల్లపూరు ఇది....నిన్న పెట్టిన గండి కొట్టుకుపోయినట్టుంది. ఇంక ఊళ్ళో ఎత్తునున్న ఇళ్ళు రెండే....ఈ ఇల్లు....రంగయ్యది" అన్నాడు కర్రమీదనించి తల ఎత్తి చూసి నారాయుడు.

'ఏమంటార'న్నట్టు ఉన్నాయి ఆ చూపులు. ఏమనటానికి ఏముందో అర్థం కాలేదు తనకి తిరిగి నారాయుడు అనేవరకు.

"కొత్తగా పెళ్ళి చేసుకుని, నాలుగు రోజులు ఒంటరిగా గడుపుదామని వచ్చినారు మీరు. మీ దగ్గిరికి మేమంతా...." మాట పూర్తి కాకుండానే అర్థమయింది....దీనికోసమా తటపటాయింపు అనిపించింది. 'పద. తొందరగా అందర్నీ తీసుకొద్దా'మని నారాయుడి చెయ్యి పుచ్చుకుని లాక్కు పోవాలనిపించింది.

ఇద్దరూ గుట్టదిగి కింద మలుపు దగ్గిరికి వచ్చేటప్పటికి కళ్ళ ముందు నీళ్ళు మెదిలాయి. నాలుగడుగులు వేసేటప్పటికి పిక్కలదాకా వచ్చాయి. చల్లగా కరుస్తున్నాయి. అలాగే నడుస్తుంటే.

"ఇళ్ళు రెండూ ఎత్తే అయినా, మే మందరం ఈ ఇంటి కొస్తేనే గట్టెక్కినట్టు" అన్నాడు నారాయుడు.

ముందు అర్థం కాలేదు తనకి.

"ఏముంది. బాబూ.....నిన్న పొద్దున్నకూడా ఏ పాకలోనూ పొగ లేవలేదు. మొన్నెప్పుడో తిన్న తిళ్ళు. ఒకళ్ళ దగ్గిరకూడా తిండికి గుప్పెడు గింజల్లేవు. డబ్బా అంతంత మాత్రమే. మీ ఇల్లయితే వేరు.....ఒక్క వర్షం దెబ్బే తట్టుకోవటం....అదే రంగయ్య ఇల్లయితే ముందు బతుక్కి దెబ్బ....ఆ ఇంట్లో బస్తాలతో గింజ లెప్పుడూ ఉంటాయి. ఎదురుగా చూస్తూ ఆకలి ఊరుకోనియ్యదు. నిన్ననే అంతుంది ఆసి ఆశ. ఈ రోజు ఈ నీళ్ళలాగే ఇంకా పెరిగుంటది. అందరి దగ్గిరా ఉన్న డబ్బు ఒడుక్కోటంతో పోనివ్వడు ...ఆడాళ్ళ కాళ్ళ మట్టెల దగ్గిరనుంచి, చెవి కమ్మలవరకు—వస్తువులే కాదు, ఆళ్ళ కమతంలోకి మనుషుల్నే వ్యాపారంలో సంపాదించాలని చూస్తాడు. అందుకు మీ ఇల్లే ఇప్పుడు గుడి మాకు. ఆకలితో రెండు రోజులు నకనకలాడినా, నీళ్ళు తగ్గింతరువాత బతుకులు మామూలుగా ఉంటాయా అన్నాడు.

ఎలాంటి జీవితం? డబ్బు చుట్టూ గిరి గీసుకుపోయిన బతుకు ముందుచూపు రూపంలో ఆకల్నికూడా జయిస్తుందా?

కనుచూపువరకూ నీళ్ళు...పాకలముందు కంచెల్ని దాటి, తలుపుల్ని, గోడల్ని మూడు వంతులు మింగేసి గుటకపడకుండా నిలిచిపోయిన నీళ్ళు. చెయ్యెత్తు మనిషయితే గుండెలదాకా వస్తాయి. మామూలు మనిషయితే పీకలదాకా తడవక తప్పదు. నడుంవరకు నీళ్ళు రావటం చూసి....

"మీరు వెనక్కి వెళ్ళి ఇంటి దగ్గిరుండండి. నేను వాళ్ళని తీసుకువస్తా" అన్నాడు...'ఫరవాలే'దన్నా బలవంతంగా వెనక్కి పంపేశాడు.

వెనక్కి తిరిగివస్తే ఇంటికి వెళ్ళాలని లేదు. గుట్ట సగం వరకూ ఎక్కి కూచున్నాడు. వర్షం లేకపోయినా మబ్బులు మామూలుగానే ఉన్నాయి.

* * *

వస్తున్నారు వాళ్లు. గుంపుగా నీళ్ళని ఒత్తిగించుకుంటూ చేతుల్లో చిన్న చిన్న మూటలతోటి, గిన్నెలతోటి, నెత్తిమీద పిల్లల తోటి. వీళ్ళని చిత్రంగా చూస్తున్న పిల్లలు, ముసలాళ్ళ చేతులు పట్టుకు నడిపిస్తున్న పడుచువాళ్ళు..పడుచువాళ్ళ నెత్తిమీద పిల్లలు.వాళ్ళు ...వాళ్ళందరి చుట్టూ నీళ్ళు. గుంపు ఒక్కొక్క అడుగే కదుపుతుంటే నీళ్ళ అంచులు కదులుతున్నాయి. నీరసంగా ఉన్నవాళ్ళు తడవటం లేదు.,.నీళ్ళు తోస్తున్నాయి ముందుకు. గుట్టదాకా వచ్చిన తరువాత 'అమ్మయ్య' అన్నట్టు ఆగింది గుంపు.

నెమ్మదిగా గుట్టమీదికి బయలుదేరారు వాళ్ళు. కొందరు సగం ఎక్కారు, ఇంకొందరు మూడువంతులు ఎక్కారు. మరికొందరు పూర్తిగా ఎక్కారు. రాత్రంతా నిద్రలేని మనుషులు, ఓ రోజంతా తిండి లేనివాళ్ళు జోగిపోతూ కూలబడ్డారు.

తను తిరిగాడు వాళ్ళందరి చుట్టూ, ఒకళ్ళ దగ్గిర నుంచి ఒకళ్ళ దగ్గిరికి, బురదకాళ్ళని దాటుకుంటూ, పసిపిల్లల ఏడుపుల మధ్య. వాళ్ళందరి నీరసం చుట్టూ.

తిరిగాడు ఇంట్లోంచి బయటికి, బయటినుంచి ఇంట్లోకి పొద్దు పైపైకి పోయినా ఎండ పొడలేదు. అలాగే జోగుతున్నారందరూ, ఆ గుట్టని పట్టుకు వేళ్లాడుతున్నట్టు.

బాధనిపించింది తనకి. ఎందుకో, ఏమిటో నిర్ధారణగా తెలియని బాధ. ఎవరూ ఏం చేయటానికి తోచకుండా కూచున్న బాధ. తను వాళ్ళచుట్టూ తిరుగుతున్నప్పుడు వాళ్ళు చేయెత్తి దణ్ణం పెట్టిన చూపుల బాధ.

రాత్రి వాళ్ళలో వాడే నరసయ్య పాక కూలిపోయిందని, ఈ మధ్యనే పెళ్ళోసుకున్న వాడి భార్య జాడేలేదని, కూలిపోయిన పాక

కింద నీళ్ళలో కూరుకుపోయారేమోనని...కళ్ళనీళ్ళతో ఇందాకా వారాయుడు చెప్పిన మాటలు గుర్తుకి వచ్చిన బాధ.

చిన్నా పెద్దా, ఆడా, మగా—అందరి ముఖాల్లోను ఆకలి. సహజంగా మనిషికి బలాన్నిచ్చి, మనిషిగా నిలబెట్టే ఆకలి. అదే ఆకలి ఇప్పు డందర్నీ తింటోంది.

• నిన్న మిగిలిన బియ్యంతో వంటచేసిన కళ్యాణికి తన నెలా పిలవాలో తెలియలేదు. వంటింట్లో కాకపోయినా చాలామంది సావిట్లో కూడా ఉన్నారు.

ఎలాగో పిలిచింది. వంటింట్లో మూలకి తీసుకు వెళ్ళింది. కళ్యాణి కంచాలు తీస్తుంటే. కళ్ళముందు వాళ్ళందరి ఆకలి కదిలింది. తనకి...తను తినకపోతే కళ్యాణి కూడా మానేస్తుందేమో, తన తోడు పంచుకుని పట్టుమని పది రోజులేనా కాకుండా పస్తులుంటుందేమో నని కూచున్నాడు.

అన్నం చేతికి చల్లగా తగిలింది. కరిచి నట్టనిపించింది... పొద్దున్న నీళ్ళలా. కడుపులో ఆకలితోపాటు, వాళ్ళందరూ అన్న దృష్టి కలగలిసి తిరిగింది. రెండు ముద్దలకన్నా ఎక్కువ దిగలేదు. కళ్యాణీ తినలేక పోయింది.

బయట వసారాలోకి, వాళ్ళందరి మధ్యకి వస్తే ఏదో తప్పు చేసినట్టనిపించింది, చేసింది అన్నం తినటమే అయినా అసహజమైన దేదో చేసినట్టు.

"అమ్మా, ఇక్కడ నేలమీద నీళ్ళు లేవుగా. బువ్వొండవా" అంటున్న పిల్లకి, చెంగుకి కట్టుకున్న మూట విప్పి పెడుతోంది పిల్ల తల్లి, నీళ్ళలో తడిసి ముక్కిపోయిన బియ్యంగింజలు.

కొందరు తడిసిన సెనగలు, ఇంకొందరు ముక్కిపోయిన నూకలు...ఇలా...ఆకలి చుట్టూ వాళ్ళందరూ...వాళ్ళందరిచుట్టూ ఆకలి..

* * *

తెల్లారుతుందా అనుకున్న రాత్రి తెల్లారింది.

"బుర్రాళ్ళు కంగారుపడేలా ఉన్నారు. బాబూ...రంగయ్య

ఇంటిమీదికి వెళ్దాం అంటున్నారు. మీరేమనుకోకుండా ఒక్కసారి రంగయ్య ఇంటికి వెళ్ళిరండి'' అన్నాడు నారాయుడు తల వంచు కుని. అలా చెప్పవలిసి వచ్చినందుకు బాధపడుతున్నట్టు.

ఇద్దరు మనుషుల సాయంతో బయలుదేరాడు రంగయ్య ఇంటికి తను. నీళ్ళు తగ్గుముఖం పట్టినట్టేం లేవు. నారాయుడు చెప్పిన దాన్నిబట్టి. ఊహించినదానికంటే అసహ్యంగా కనిపించాడు రంగయ్య ఆకారంలోనూ, బుద్ధుల్లోనూకూడా. ముతకపంచ, గుడ్డ బనీను, సోమరిగా పెరిగిన పొట్ట. నోట్లో పెద్ద చుట్ట...అస్తమానం అసహ్యంగా ఉమ్ములు. నంగినంగిగా మాట్లాడాడు. మామూలు రోజుల్లో వంద ఖరీదు చెయ్యని బియ్యానికి మూడు వంద లిస్తానని తన తరపునా, ఊళ్లో రంగయ్యతో సమాన ఫాయిదాలో ఉన్న నరసింహం తరపునా హామీ ఇస్తానన్నా వినలేదు.

ఇది సమయం అన్నాడు. తెలివైన వ్యాపారానికి ఇంతకంటే మంచి అదనుండదన్నాడు. తనకి కావాలంటే ఓ పది శేర్ల బియ్యం తీసుకువెళ్ళమన్నాడు, పెళ్ళాంతో సుఖంగా నాలుగు రోజులు గడప టానికి. వాళ్లందరి గొడవా వాళ్ళకే వదిలివెయ్యమని నీతులు చెప్పాడు రంగయ్య.

తిరిగి వచ్చేస్తూంటే...

సంగతులన్నీ విన్న తరవాత నారాయుడు, మిగిలిన వాళ్ళు 'ఏం చేయమంటా'రని తనని అడుగుతా రనిపించింది. 'ఏం చేయమనాలి? వాళ్ళు చేద్దామనుకునేదేమిటి? రంగయ్యని...రంగయ్యని దోస్తామం టారు. ఏమనాలి తను? రేపు తన ఫాక్టరీలో వాళ్ళుకూడా తనని ఇలా దోస్తామంటే ఏమంటాడు తను?....'

ఊహించినట్టుగానే అయింది...వాళ్ళందరి చూపులు అడిగాయి. నారాయుడు నోరు తెరిచే అడిగాడు, ''బాబూ! ఏం చేయమంటారు? మా కుర్రాళ్ళు ఊరుకునేలా లే''రని. వాళ్ల అలిసిన కళ్లలో నించి, విన్న మొన్నా తడిసిన శరీరాలలోనించి ఆకలి చేతికర్రల్లోకి చేరినట్టు కదిలాయి కర్రలు.

తనలో ఓ నిశ్చయం ఏర్పడింది. దోచేది రంగయ్యనికాదు.

ఆ మనిషివి కాదు. అతని అత్యాశని, అవకాశంతో ముడి వేసుకున్న అమానుషత్వాన్ని, తప్పు లేదనిపించింది. కర్రలతో కదిలిన వాళ్ళ వెనకే తనూ నడిచాడు.

దిగుడుగా ఉన్న గుట్టరాళ్ళమీద గబగబా పడుతున్నాయి వాళ్ళ అడుగులు. వాళ్ళకి నారాయుడో పక్క. తనో పక్క.

కదలకుండా నిలబడ్డ నీళ్ళమీద కదులుతున్న వరదలా ఉన్నారు వాళ్ళు.

రంగయ్యకి ముందుగానే వార్త తెలిసినట్టుంది. తన పెద్ద పాలేరు ఎల్లయ్యతోపాటు మరో ముప్పైమందికి కర్రలిచ్చి నిల బెట్టాడు.

'కర్రలు కలవాలా? తలలు బద్దలయి నెత్తురు చిమ్మాల్సిం దేనా? వరదలా, ఉప్పెనలా ఉన్న వీళ్ళముందు ఆ ముప్పైమంది ఎంతసేపు నిలవగలరు?' కాని రంగయ్య దృష్టికి అక్కర్లేదీ విషయం. తన వ్యాపారం, తన డబ్బూ...ఇవే.

గుంపునంతటినీ ఆగమన్నాడు నారాయుడు. ఒక్కడే కదిలి ముందుకి వెళ్ళాడు ఎల్లయ్య దగ్గిరికి. ఎదురుగా నిలబడ్డాడు. ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు ఓ క్షణం. నారాయు డనేది వినిపిస్తోంది.

"ఒకూరోళ్ళం. ఈ నీటిముంపు, ఈ సమయం నీకు తెలుసు. ఈ సమయంలో నువ్వు ఈళ్ళందర్నీ నాలా ఎంటేసుకు మా కామందు దగ్గరకొచ్చినా, నేను నీలా అడ్డు నిలిచేవాణ్ణి కాదు. మూడు పూట ల్నించి ఎవరూ గంజికూడా తాగలేదు. మాక్కావలసింది రెండు మూటల బియ్యం. ఆయనతో సెప్పు" అన్నాడు.

ఓ క్షణం ఆలోచన తరవాత కర్రని కొంచెం ఎత్తాడు ఎల్లయ్య. ముందుకి చూశాడు. నారాయుడి భుజాలమీంచి మండుతున్న వరదలా ఉన్నారు వాళ్ళు. వెనక ఇంట్లో స్తంభంచాటున నిలబడు న్నాడు రంగయ్య. లౌక్యం, నలభై ఏళ్ళ జీవిత అనుభవం నిర్ణయం చేసింది ఎల్లయ్య మనసులో. రంగయ్య ఇచ్చే యాభైకో, వందకో కక్కుర్తిపడి వీళ్ళ కెదురు నిలవటం అంత మంచిది కాదనిపించింది. దానికన్నా ఈ నీటిముంపు తగ్గిన తరవాత ఊళ్లో అందరూ తమని

వెలేపిన కుక్కల్లా చూస్తా రనిపించింది. అలాగే కదిపిన కర్రని పక్కకి విసిరేశాడు ఎల్లయ్య. రంగయ్య అరుస్తూనే ఉన్నాడు. 'పీ కింతిస్తా... అంతిస్తా. . దెబ్బలాడ'మని.

వరద ముందుకు కదిలింది, రంగయ్య ఇంటిలోకి. వాళ్ళ ఆకలి నవ్వింది. వాళ్ళ పిరసం గంతులేసింది. రెండు బియ్యంమూటల్ని అవలీలగా ఎత్తుకో గలిగింది ఆ ఉత్సాహం.

* * *

ఆ గుట్టమీద...ఇంటిముందు వాకిట్లో, వరసగా కూచున్న అందరికీ కళ్యాణి అన్నం వడ్డిస్తూంటే, ఆవురావురని ఎదురు చూస్తున్న చిన్నపిల్ల' కంచంలో వడ్డిస్తున్న అన్నంతోపాటు రెండు కన్నీటి చుక్కలు కూడా రాలాయి.

తెల్లటి ఆ అన్నం 'దోపిడీ'దే అనిపించినా, వ్యామోహ లోభం చేసింది కాకుండా, జీవితం, అవసరం, ఆకలి వేపిందనిపించింది... న్యాయం తనంత తనుగా చేసిన 'దోపిడీ' అనిపించింది తనకి. ఆ సమయంలో వరద, ఆకలివరద, తగ్గుముఖం పట్టినట్టనిపించింది.

'ఆంధ్రప్రభ'లో ముద్రితము - కన్నడంలోకి
(మయూర - మే' 71) అనువదింపబడింది.